క్లుప్తంగా

ఈవోకు సింహగిరి వర్తకుల సన్మానం



ఈవో శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న వర్తక సంఘం అధ్యక్షుడు కిరణ్, తదితరులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని గురువారం సింహగిరి వర్తక సంఘం నాయకులు, వర్తకులు మర్యాద పూరకంగా కలిశారు. దుశ్శాలువా కప్పి సత్కరించారు. వర్తకులతో త్వరలోనే ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఈవో హామీ ఇచ్చారు. వర్తక సంఘం అధ్యక్షుడు మొగ్గ కిరణ్, ఉపాధ్యక్షుడు సానబోయిన రాజు, కోశాధికారి దొంతల శంకర్, సభ్యులు బంటుబిల్లి సురేష్, మద్ది అప్పలరెడ్డి, మాజీ అధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న గొరపల్లి శ్రీను

సింహాచలం: గొరపల్లి పంచాయతీ గంగంపేట గ్రామంలో కొలువుదీరిన దుర్గాలమ్మ పండగ గురువారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించి మొక్కుతీర్చుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గొరపల్లి పంచాయతీ ప్రెసిడెంట్ గొరపల్లి శ్రీను భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ ధర్మకర్త బి.ముకుందరావు, ఎంటీసీ చిరికి దేముడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



పాలమరశెట్టి సంజయ్ (ఫైల్ ఫొటో)

గోపాలపట్నం: కుటుంబ కలహాలతో రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పద్మనాభ నగర్ ఎస్సీబీసీ కాలనీ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ బీసీ కాలనీ వద్ద నివాసముంటున్న పాలమరశెట్టి సంజయ్(38) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నాళ్లు రేషన్ పంపిణీ చేసే వాహనాన్ని నడిపేవాడు. ఇటీవల కుటుంబంలో కలహాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెదకగా రైల్వే ట్రాక్‌పై మృతి చెందడం గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతునికి తండ్రి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేస, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

డీఎల్‌సీసీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ఉష

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు డాక్టర్ పి.ఉష డిస్ట్రిక్ట్ లెవెల్ లోకల్ కంప్లెంట్స్ కమిటీ(డీఎల్‌సీసీ) చైర్‌పర్సన్‌గా రెండోసారి నియమితులయ్యారు. ఈమె ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. ఈమెతోపాటు ఇతర సభ్యులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళలు పనిచేసే స్థలంలో లైంగిక వేధింపులు సంబంధిత ఫిర్యాదులపై ఈ కమిటీ విచారణ చేస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఉషను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణకు ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్‌లూమ్స్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా సూయింగ్ మెషీన్ ఆపరేటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ ఖాదీబోర్డు, అపెరల్ పార్క్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్.వి.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 35ఏళ్ల లోపు మహిళలు మాత్రమే అర్హులని, 7వ తరగతి ఆ పైన చదివి ఉండాలని తెలియజేశారు. 45 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఎంఎస్, వైజాగ్ అపెరల్ పార్క్ ఫర్ ఎక్స్‌పోర్ట్, వడ్లపూడిలో నేరుగా లేదా 97034 24768, 92930 57305కు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

దుమ్మూ, ధూళితో ప్రజల ఇక్కట్లు



లంకెలపాలెం కూడలిలో వాహనాల రాకపోకలతో ఎగసిపడుతున్న ధూళి

పరవాడ: పలు పరిశ్రమలకు తరచూ రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలతో లంకెలపాలెం కూడలి రద్దీగా మారడంతో పాటు దుమ్మూ, ధూళితో నిండిపోతోంది. దీంతో వివిధ పనులపై కూడలికి వస్తున్న అనేక గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. పరిశ్రమలకు అవసరమైన బొగ్గు, ఇతర సామగ్రి సరఫరా చేస్తున్న భారీ వాహనాలు లంకెలపాలెం కూడలి మీదుగా నడుస్తున్నాయి. అదే విధంగా వివిధ ప్రాంతాలకు బూడిద తరలిస్తున్న లారీలు కూడా ఈ దారిలోనే నడుస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా లంకెలపాలెం కూడలి అధ్వానంగా మారింది. వంతెన కూడా శిథిలమవుతోంది. వాహనాల రాకపోకల సమయంలో గాల్లోకి ఎగసిపడుతున్న దుమ్మూ, ధూళి కూడలిని కమ్మేస్తోంది. ఇక్కడ ఎగసి పడుతున్న ధూళి పీల్చి తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఏర్పడిన పెద్దపెద్ద గోతుల్లో ఈ దుమ్మూ, ధూళి చేరుకుని వాహనాలు ప్రయాణించే సమయంలో పైకి లేచి ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి దుమ్మూ, ధూళి ఎగసిపడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంచేయించి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు భీమస్వామి (ఫైల్)

సబ్బవరం : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మండలంలోని ఇరువాడ గ్రామానికి చెందిన జెట్టి భీమస్వామి (43) వంట కుక్‌గా పని చేస్తూ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. సొంత పనులపై మంగళవారం సబ్బవరం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వస్తుండగా మార్గ మధ్యలో హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో భీమస్వామికి తల వెనుక బలమైన గాయాలు కావడంతో స్థానికులు సబ్బవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతను గురువారం కేజీహెచ్‌లో మృతి చెందాడు. మృతదేహన్ని కుటుంబ సభ్యులు గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య సూరమ్మతో పాటు లలిత, గాయిత్రి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అదనపు డీసీపీ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో గురువారం ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ(ట్రాఫిక్) జి.శ్రీనివాసరావు విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చని చెప్పారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, వాహనాలు నడిపేటప్పుడు యువత ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. పిల్లలకు ఏ చిన్న ప్రమాదం సంభవించినా వారి తల్లిదండ్రుల జీవితం అగమ్యగోచరం అవుతుందని గుర్తించాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకుని తమకు భరోసాగా ఉండాల్సిన పిల్లలు ప్రమాదాల్లో గాయాలపాలై తల్లిదండ్రులకు భారం కాకూడదన్నారు. ఏవీఎన్ కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ప్రపంచంలో అత్యున్నత స్థాయిలో ఉన్నారని, వారిని నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రయత్నాలు సాగిస్తూనే ఉండాలన్నారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలోనే వృత్తి నైపుణ్య శిక్షణ, భాషా పరిజ్ఞానం పెంపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. హార్బర్ సర్కిల్ ట్రాఫిక్ సీఐ జి.ఆర్.కె.తులసీదాస్ మాట్లాడుతూ రోడ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని, సురేష్‌బాబు, యేసయ్య, అప్పారావు, వినీత, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకోవాలి



పాత డెయిరీ ఫారం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: విశాఖ ఉక్కును ప్రజలే కాపాడుకోవాలంటూ సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి పక్కన పాత డెయిరీ ఫారం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి వ్యతిరేకంగా బైక్ ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ బైక్ ర్యాలీకి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు నరేంద్రకుమార్, శంకరరావు, సత్యనారాయణ, లక్ష్మి, భూలోకరావు, సన్యాసమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రతి గురువారం నిర్వహించే సహస్ర తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 32 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించి పాల్గొనవచ్చు. పరోక్ష పద్ధతిలో పూజ పాల్గొనాలనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సి కోడ్ యూబీఐఎన్ 0806081లో పూజా రుసుం చెల్లించవచ్చు.

నేడు ఎస్జీఎఫ్ నియోజకవర్గ స్థాయి పోటీలు

అగనంపూడి: పెందుర్తి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు, ఎంపికలు శుక్రవారం ఉదయం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు నియోజకవర్గం కో–ఆర్డినేటర్ లక్ష్మీరాణి, పరవాడ మండల కో–ఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. అండర్ 14, 17 (బాలురు, బాలికల) విభాగాల్లో పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు. వాలీబాల్ అండర్–14 బాలురు, బాలికలకు మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, యోగా, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు, ఎంపికలు చేయనున్నామన్నారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు పాఠశాలలకు చేరుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్–2 పరిధి 33/11కేవీ అంతకాపల్లి సబ్‌స్టేషన్–11కేవీ, గుల్లేపల్లి రూరల్ ఫీడర్ పరిధిలో మొగలిపురం, మల్లునాయుడుపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అప్పన్న సన్నిధిలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న విజయ్‌బాబు దంపతులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామిని గురువారం అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.వి జయ్‌బాబు సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

శాంతితోనే అభివృద్ధి సాధ్యం

సీతంపేట: దేశాల మధ్య శాంతి నెలకొల్పడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్ అన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి కోసం దేశాలన్నీ కలిసి కృషి చేయాలని, భారతదేశం చురుకైన పాత్ర వహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు నిత్యం జరుగుతూనే ఉండాలని సూచించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ శాంతిని నెలకొల్పడం కోసం ఐక్య రాజ్య సమితి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో బేగ్, ప్రజ్ఞాన్ కుమార్, నాయుడు, కమల్, గోపీచంద్ పాల్గొన్నారు.

ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ఆధునికీకరణపై హర్షం



ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంను పరిశీలిస్తున్న విజయబాబు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు సందర్శించారు. ముందుగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, ప్రగతిని వీసీ ప్రసాదరెడ్డి ఆయనకు వివరించారు. అనంతరం ఏయూలో ఆధునికీకరించిన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగి, ఎందరో జాతీయ స్థాయి కళాకారులకు సైతం స్థానం కల్పించిన ఈ ప్రాంగణం పునరుజ్జీవనం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఏయూ ఉద్యోగులతో కలసి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గురజాడకు ఘన నివాళి



గురజాడ అప్పారావు జయంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి శిరీష, తదితరులు



గురజాడకు నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ అధికారి నరసింహం తదితరులు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా ప్రతినిధి పి.మాణిక్యం మాట్లాడుతూ సాంఘిక పరివర్తనకు కృషి చేసిన ఘనత గురజాడకు దక్కుతుందన్నారు. కన్యాశుల్కం నాటకం సమాజంలో ఎంతో మార్పు తీసుకొచ్చిందన్నారు. అనంతరం గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, తెలుగు పండింట్ లక్ష్మికాంత, అధ్యాపకులు నిర్మల, అనకాపల్లి ఐద్వా జిల్లా అధ్యక్షుడు భీమాని, పి.రోషిని, పూజిత, పుష్ప, శాంతి, ఇప్పిబారేష్మ, బిందు, బేబీ, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురజాడ అప్పారావు చిత్ర పటానికి గ్రంథాలయ అధికారి పి.శిరీష పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని అభివృద్ధి చేసిన గొప్ప సాహితీకారుల్లో ఒకరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భవిత సీఆర్‌టీ సింహాద్రి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరి, పాఠకులు చందు, నళిని, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక అసమానతలు రూపుమాపిన గురజాడ

సింహాచలం : అభ్యుదయ కవి గురజాడ అప్పారావు అని, సాంఘిక అసమానతలను రూపుమాపేందుకు కృషి చేసిన ప్రముఖ తెలుగు రచయితల్లో గురజాడ ఉత్తముడిగా నిలుస్తారని అడవివరం గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం తెలిపారు. గ్రంథాలయంలో గురువారం గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్.వి. నరసింహం మాట్లాడుతూ సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహా కవి గురజాడ అప్పారావు అని, తెలుగు సాహిత్యాన్ని అభివృద్ధి చేసిన గొప్ప సాహితీవేత్త అన్నారు. కార్యక్రమంలో రచయిత సీహెచ్ఎస్ఎన్ రాజు, కార్టూనిస్ట్ మోదు రాజేశ్వరరావు, గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ, న్యాయవాది రామకృష్ణ, పాఠకులు కిరణ్‌కాంత్, హరీష్, మోహన్, వరలక్ష్మి, మహేంద్ర, అనురాధ, దీక్షిత పాల్గొన్నారు.

మొబైల్ సేవలతో చేరువగా వైద్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్పేజ్ ఇండియా ప్రతినిధి డాక్టర్ కేవీ రావు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సహకారంతో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెల్పేజ్ ఇండియా సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ కేవీ రావు పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లి, గొల్లపేట గ్రామాల ప్రజలకు మొబైల్ వ్యాన్ ద్వారా గురువారం వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ సీఎస్సార్ సహకారంతో ప్రతి వారం 29 గ్రామాలకు చెందిన మధ్య తరగతి, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందజేస్తున్నామని చెప్పారు. మధుమేహం, బీపీ, కీళ్ల నొప్పులు, గ్యాస్టిక్, థైరాయిడ్, మూర్ఛ, చర్మ వ్యాధులకు ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. అలాగే నడవలేని రోగులకు ఇంటి వద్దే వైద్య పరీక్షలు జరిపి మందులిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

మతిమరుపు సమస్య క్లిష్టమైనది



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.ఎస్.రాజు

సీతంపేట: ఆరు పదులు దాటిన వృద్ధుల్లో ఎనిమిది శాతం మందికి కలిగే మతిమరుపు వ్యాధి అత్యంత క్లిష్టమైనదని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ఎస్.రాజు అన్నారు. ప్రపంచ అల్జీమర్స్ డే సందర్భంగా కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషుల్లో కంటే మహిళల్లో ఎక్కువగా మతిమరుపు వస్తుందని చెప్పారు. ప్రారంభంలో చిన్నచిన్న విషయాలను మరిచిపోవడం, ఆ తర్వాత సమస్య తీవ్రమై తమ దైనందిన చర్యల నిర్వహణ కూడా కష్టమవుతుందన్నారు. ప్రవర్తనలో మార్పులు, అనిశ్చిత భావోద్వేగాలు, భ్రమలతో భయకంపితులు కావడం, దారులు మర్చిపోవడం, దుస్తులు వేసుకోవడం కష్టం కావడం, కుటుంబ సభ్యులను గుర్తు పట్టలేకపోవడం వ్యాధి తీవ్రతను సూచిస్తుందని తెలిపారు. జ్ఞాపకశక్తి మెదడులో ఏవిధంగా నిక్షిప్తమవుతుంది, అది క్షీణించి మతిమరుపు కలగడానికి గల కారణాలను వివరించారు. ఈ వ్యాధిని సరైన సమయంలో గుర్తించి నిపుణుల సలహాలతో కొంత నివారించవచ్చన్నారు. చక్కని నిద్ర, పోషకాహారం, ప్రణాళిక బద్ధమైన దినచర్య, తేలికపాటి వ్యాయామం ఈ వ్యాధిని అరికట్టడంలో కీలకంగా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో మానసిక వైద్యులు ఎస్.జి.నిహాల్ పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



కేక్ కట్‌చేస్తున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నుంచే పరిపాలన సాగుతుందని ప్రకటించడంతో విశాఖలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం ఎస్‌పీడీ సమీప 52వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయదశమి నుంచి పరిపాలన సాగిస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎస్‌పై ఆమోదం పొందడం మంచి విషయమన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్, వెంకటరమణ, నారాయణమ్మ, అనూరాధ, ధనలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ శాంతి దినోత్సవం



శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు తదితరులు

ఎంవీపీ కాలనీ: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బీపీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ 42 ఏళ్లుగా ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి నెలకొల్పాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించాలన్నారు. ఈ నేపథ్యంలో బాల్యం నుంచే యువత శాంతి, సామరస్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు.